# చివరికి ప్రేమ

వై. శేఖర్

**కొండయ్య** సరాసరి హాలులోకొచ్చి "దణ్ణాలు, చినబాబూ" అన్నాడు.

మందు సేవిస్తున్న చినబాబు తలెత్తి చూశాడు.

"కొండా, వచ్చావంట్రా. అర్జంటుగా షిప్ నుంచి సరుకు దించుకు రావాల్రా!"

"అమ్మో. కష్టం చినబాబూ. కొత్త సూపర్నెంటు చాలా గట్టి మడిసంట. రొండ్రోజు లాగితే."

"ఒరేయ్. ఈ కతలు నాకు చెప్పొద్దు. షిప్ మన కోసం ఆగుతుందా? కావాలంటే పది రూపాయలెక్కువ అడిగి పుచ్చుకో."



''ఈయన తండకాసను డంటున్నారు చినబాబూ''

''ను వ్వెందర్ని చూళ్ళేదురా. పెద్ద పెద్దోళ్ళనే పల్టీలు కొట్టించావయ్యో.''

''నిజమే ననుకోండి.'' కొండయ్య మెత్తబడి అన్నాడు.

''మరింకేంటి. మేనేజర్ నడిగి అడ్వాన్స్ పట్టు కెళ్ళు. జాగ్రత్త'' అని చినబాబు మళ్ళీ మందులో పడ్డాడు.

కొండయ్య బయటకు [illegible]లాడు. వరండాలో వచ్చేసరికి వర్షం పడుతూంది. ఇద్దరు ఆడవాళ్ళు లోపలికి వస్తున్నారు. కొండయ్య వాళ్ళను గమనించ కుండా స్తంభాన్ని ఆనుకుని బీడీ ముట్టించాడు.

ఆడవాళ్ళిద్దరూ వరండాలో ఒక మూలగా నిల బడ్డారు. ఒకామెకు సుమారు నలభై ఏళ్ళుంటాయి. రెండో ఆమెకు పంధొమ్మిది ఇరవై ఉంటాయి.

పది నిమిషాలు గడిచాయి.

''అమ్మా. అట్టా నిలబడ్డా రేంటి? లోపలి కొచ్చి కూసోండి.'' నౌకరు వచ్చి ఆడవాళ్ళను పిలిచాడు.

''పరవాలేదు. పూరు కానివ్వారు. అనుకోకుండా వర్షం వచ్చింది. పక్క వూరెళ్ళాలి. తగ్గగానే వెళ్లి పోతాం.'' ఆడవాళ్ళలో పెద్దామె సమాధానం చెప్పింది.

''దీని వరస జూస్తుంటే తగ్గేటట్టు లేదు. ఎంత సేపని నిలబడతారు. వచ్చి కూసోండమ్మా'' అని నౌకరు లోపల కెళ్ళాడు.

ఆడమనిషి గొంతు విన్న కొండయ్య అటు తిరిగి చూశాడు. బీడీ విసిరేసి వాళ్ళవైపు వెళ్ళాడు.

''వరం. నువ్వా. ఎప్పుడొచ్చావ్. మన పాప. ఎంత పెద్దదై పోయింది పేరు రాధ కదూ.''

''నువ్వా. వూళ్ళో అడుగు పెట్టి నప్పటినుంచి నీ దరిద్రపు ముఖం ఎక్కడ ఎదురవుతుందోనని అనుకుంటూనే ఉన్నాను. వర్షంలో తడిసి పోతామని కాసేపు తల దాచుకోటానికి వస్తే ఇక్కడ దాప రించావా?'' వరలక్ష్మి తీవ్రంగా అంది.

''ఎందుకే, వరం, అంతగా రెచ్చి పోతావ్? నా బిడ్డని ఎన్నాళ్ళకి సూశాను! నువ్వెంత కాదన్నా నే దాని తండ్రిని కాపోతానా? అది నా కూతురు కాపోతుందా?'' కొండయ్య రాధ తల నిమరబోయాడు.

అప్పటివరకు సాలోచనగా చూస్తున్న రాధఒక్కసారి గర్జించింది.

''ఆగు. మా అమ్మ బతుకు నాశనం చేసింది చాలు. నీ పాపిష్టి చేత్తో నన్ను తాకబోకు.''

కొండయ్య నివ్వెరబోయి అట్లాగే నిలబడ్డాడు. అతని ముఖం ఒక్కసారి వివర్ణమై పోయింది. బయట అరుపులు విన్న నౌకరు మళ్ళీ వచ్చాడు.

''ఏంటమ్మా. ఏమైంది? ఏంటి, కొండయ్యా, ఏమన్నా యదవ మాట అన్నావా?''

''యేంట్రా నా కొడకా అన్నావ్'' కొండయ్య ఉరిమి చూశాడు. నౌకరు తోక ముడిచి వెళ్ళి పోయాడు.

వరలక్ష్మి కూతుర్ని తీసుకుని లోపల కెళ్ళింది. కొండయ్య ఉస్సురంటూ అక్కడే గుంజ నానుకుని కూర్చున్నాడు. పది నిమిషాలు గడిచాక నౌకరు మళ్ళీ వచ్చాడు.

''కొండయ్యా. అయ్యగారు అర్జెంటు పని చెబితే ఇంకా ఇక్కడే కూకున్నావా?''

''ఉండరా. వాన ఇంత జోరుగా ఉంటే ఎట్లా?''

''గొడు గిస్తానుండు'' అని నౌకరు లోపలి కెళ్ళి గొడుగు తెచ్చిచ్చాడు.

గొడుగేసుకుని గేటు దాకా వెళ్ళిన కొండయ్య ఏదో ఆలోచన వచ్చి వెనక్కొచ్చాడు. అప్పటికి హాలు తలుపేసుంది. లోపల నుంచి కేకలు వినిపిస్తున్నాయి కొండయ్య దబదబ తలుపులు బాదాడు.

''చినబాబూ. ఆ పిల్ల నేం జెయ్యమాక.''

''పోరా, కొండా. నీ పని జూసుకో.''

''చినబాబూ. ఆ పిల్లనే మన్నా జేస్తే నెత్తురు తాగేస్తా''.

''నోర్మూయ్. పాపమని చెప్పటంలా?'' చినబాబు కసిరాడు.

కొండయ్య అటు ఇటు చూశాడు. దొడ్లో మూలగా పడి ఉన్న రాళ్ళ గుట్ట దగ్గర కెళ్ళాడు. ఒక బండరాయి తెచ్చి తలుపుని బలంగా బాదాడు. అంచూరు దెబ్బల్లో చెక్క వూడి పడింది.

లోపల నౌకరు వరలక్ష్మిని ఒడిసి పట్టుకున్నాడు. ఆమె విడులుచ్చుకుంటూంది. చినబాబు రాధను గదిలోకి లాగుతున్నాడు. ఆమె పెనుగులాడుతూంది. కొండయ్య పులిలా చినబాబు మీదకు ఉరికాడు. రాధ తప్పించు కుంది.

''లమ్డికొడకా. నామీదకే వస్తావా?'' చినబాబు కలియపడ్డాడు.

కొండయ్య రాగానే నౌకరు వరలక్ష్మిని వదిలి



తనూ అతని మీద కొచ్చాడు. వరలక్ష్మి కూతురు చేయి పట్టుకుని పరుగెత్తుకుంటూ తీసుకు పోయింది. రాధ వెనుదిరిగి మధ్య మధ్యలో చూస్తూ ఆమె వెంట వెళ్ళింది.

చినబాబు, నౌకరు ఇద్దరైనా కొండయ్య భారీ మనిషి కావటంతో అతని ముందు తట్టుకోలేక పోయారు. కొండయ్య ఇద్దరినీ గట్టిగా బాదేశాడు. అతని పిడికిలి దెబ్బలకు, మోకాలి పోట్లకు తట్టుకో లేక చినబాబు గింగిరాలు తిరుగుతూ కింద బడ్డాడు. నౌకరు మూల కెళ్ళి నక్కాడు.

కొండయ్య హడావిడిగా బయటకు పరుగెత్తాడు. వాన జోరుగా పడుతూనే ఉంది. వరలక్ష్మి, రాధ అప్పటికే కనుమరుగై పోయారు. కొండయ్యకూడా ఆ వర్షంలోనే పడి తన గుడిసె కెళ్ళాడు.

● ● ● ●

''ఏంటి రాధా అట్లా కూర్చున్నావ్'' ఉదాసీనంగా ఆలోచనల్లో మునిగి తేలుతూ, గోడకు చేరగిలబడి కూర్చున్న కూతుర్ని అడిగింది వరలక్ష్మి.

''ఏం లేదమ్మా.''

''ఏం లేదంటావే. నిజం చెప్పు. వచ్చిన కాడి నుంచి నిన్ను గమనిస్తున్నాను. ఆ దరిద్రుడు గురించే ఆలోచిస్తున్నావు కదూ.''

''ఆలోచనేం లేదమ్మా. ఆయన చేసిన ఉపకారానికి కనీసం కృతజ్ఞతైనా చెప్పలేక పోయాను.''

''కృతజ్ఞతా. వాడికా. ఒకనాడు నీ తల్లి జీవితాన్ని నాశనం చేసిన భ్రష్టుడికా?''

''ఒకనాడు నీ జీవితాన్ని నాశనం చేశాడు. నిజమే కాని ఈ నాడు నా బతుకుని కాపాడిందీ ఆయనే కదా.

''అంటే దానితో వాడు పుణ్యాత్ముడై పోయా డన్నమాట.''

''ఎందుకమ్మా అంత తీవ్రంగా తీసుకుంటావు?''


''తీవ్రం కాక ఏమిటి? అర్ధరాత్రి నిద్రలో ఉన్న నన్ను బలాత్కరించి జీవితాన్ని సర్వ నాశనం చేసిన నీచుడు వాడు. పశుబలంతో వాడు నన్ను నాశనం చేశాడని, అందులో నా తప్పేమీ లేదని తెలిసికూడా ఈ సమాజం నన్ను చెడిపోయిన మనిషి అంది.

నువ్వు కడుపున పడిన నాడు అందరూ నన్ను పెళ్ళి కాకుండానే తల్లి అవుతూందని ఛీత్కారం చేసినా బెదిరి పోలేదు. ఆ కూతలు కూసిన వాళ్ళను ధైర్యంగా ఎదుర్కొన్నాను.

నిన్ను నవ మాసాలు మోసి, కని పెంచాను. నాబతుకంతా కరగించి మరీ పెంచానే. పంథొమ్మి దేళ్ళుగా నువ్వే జీవిత మనుకుని నీ మీదే ఆశలో బతుకుతున్నాను. కాని ఇవ్వాళ నీకు నాకన్న వాడే ఎక్కువై పోయినట్టున్నాడు.''

''ఎందుకమ్మా అట్లా అంటావు. ఆయన చేసి పరోపకారానికి రవ్వంత కృతజ్ఞత చెప్పాలనుకోవటం అంత క్షమించరాని నేరమా? అంత మాత్రానికి ఆయన నాకెక్కువై పోయాడా?''

''నేరమేనే. ముమ్మాటికీ నేరమే. వాడు నీ తల నిమర బోయినప్పుడు. 'ఆగు. నీ పాపిష్ఠి చేతులతో నన్ను తాకబోకు.' అని అన్నప్పుడు నిజంగా గర్వ పడ్డాను. నా బిడ్డ నా పెంపకాన్ని సార్థకం చేసిం




దంటే. ఛీ. ఇంక నే వెందుకు? ఇన్నేళ్ళ పెంపకం ఎందుకు ఇంకేం వెళ్ళవే. వాడి దగ్గరకే వెళ్ళు. కృతజ్ఞతేం కర్మ. వాడి దగ్గరే ఉండు.''

''అమ్మా. నా కన్న ఎంతో పెద్దదానివి. అట్లా తొందరపడి మాట్లాడటం బాధగా ఉంది. ఆయన నీ పట్ల చేసిన నేరాన్ని, నువ్వు చెప్పిన విషయాలన్ని విని ఆయన మీద ఎంతో వ్యతిరేకత పెంచుకున్నాను. ఆ సంగతి నీకూ తెలుసు.

కానీ ఆయన ప్రవర్తనకు చాలా ఆశ్చర్యం కలిగించింది. నువ్వెంత పరుషంగా తిట్టినా ప్రాధేయ పడుతూ, నా తల ఒక్కసారి నిమరనిస్తే చాలు అనుకున్నాడే కానీ నిన్ను పల్లెత్తు మాట అనలేదు.

నేను విన్న రాతిమనిషికి, కళ్ళెదుట కనిపిస్తున్న దృశ్యాలకు మధ్య అంత వ్యత్యాసం కల్పించేసరికి నేను నిజంగా అవక్కాయి పోయాను. అయినా నీకు జరిగిన అన్యాయం గుర్తొచ్చి వెంటనే కసురు కున్నాను.

కాని ఆ సంఘటన తరవాత నాకు ఆయన చూపిన జాలి చూపులే గుర్తుకొస్తున్నాయి. నన్ను అపార్థం చేసుకోవద్దు. నేనుఆయనపట్ల క్రూరంగాప్రవర్తించా ననిపిస్తూంది. ఒక్కసారి ఆయన్ని కలిసి కృతజ్ఞత చెప్పుకోవాలనిపిస్తూంది.''

''రాధా''. వరలక్ష్మి బిగ్గరగా అరిచింది.

''మంచిది. కానివ్వు. జీవితంలో చక్కని గుణపాఠం నేర్పావు. నీకు రెక్కలొచ్చినాక నా అవసరం ఏమిటిలే.'

''అమ్మా. ప్లీజ. అట్లా మాట్లాడకు. భావ్యం కాదు.''

''నిజంగా మాట్లాడనే. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. వరలక్ష్మి సూట్ కేస్ సర్దుకుంటూ అంది.

''ఏమిటమ్మా అది. సూట్ కేస్ సర్దుతున్నా వేంటి?''

''నే వెళ్ళిపోతున్నాను.''

''పెళ్ళి ఇంకా నాల్రోజు లుందిగా.''

''అవన్నీ నా కనవసరం. నేను జీవితంలో ఓడి పోయాను. లోకం మీద గెలిచిన నేను నీ చేతుల్లో చిత్తుగా ఓడిపోయాను. ఈ అవమానం చాలు.'

''ఉద్రేక పడకమ్మా. ప్రశాంతంగా ఆలోచించు. రాధ తల్లి చేతుల్లో సూట్ కేస్ తీసుకోబోయింది.

''రాధా. నిర్మొహమాటంగా చెబుతున్నాను ఇక నీ దారి నీది. నా దారి నాది'' వరలక్ష్మి రాధను తోసేసింది.

''ఆ మాట నువ్వనగలవు. నే నెట్లా అనగలనమ్మా ఇంకేం నేనూ వచ్చేస్తా పద'' రాధకూడా తన సూట్ కేస్ సర్దుకుంది.

అంతలో వరలక్ష్మి తల్లి సీతమ్మ వచ్చింది.

''ఏంటే ఏదో గొడవ పడుతున్న ట్లున్నారు?''

''ఏం లేదు. నే అర్జంటుగా వెళ్ళాల్సొచ్చింది.''

''ఉన్నట్లుండి ఇదేంటి?'' ఏమైంది?''

''ఏం కాలా ... నే వెళ్ళాలి ... అంతే'' వరలక్ష్మి అంది.

సీతమ్మ మనవరాలి వంక చూసింది. రాధ ఏం చెప్పలేకపోయింది. వరలక్ష్మి అన్న, వదిన అంతా కూడా వచ్చారు. ఎవరు అడిగినా, పదే పదే అభ్యర్థించినా వరలక్ష్మి వినలా. ప్రయాణం కట్టింది. రాధ కూడా ఆమె వెంట వెళ్ళింది.

● ● ● ●

గుంటూరు తిరిగొచ్చాక తల్లి, కూతురు ఎడ మొహం, పెడ మొహంగానే ఉన్నారు. క్రమంగా పరిస్థితి మారినా వెనకటి ప్రేమానురాగాలు మాత్రం తిరిగి నెలకొనలేదు.

పదిహేను రోజులు గడిచేసరికి రాధకు అనంత పురంలో ఉద్యోగం వచ్చింది. తల్లిని విడిచి వెళ్ళవలసి వచ్చింది. చాలా రోజుల వరకు గుంటూరు వచ్చే అవకాశమే కుదరలేదు.

కొంతకాలం తర్వాత రాధ వచ్చినా తల్లీ కూతుళ్ళ మధ్య ఏర్పడిన కలతలు మాసిపోలేదు. రాధ చుట్టపు చూపుగా ఉండి వెళ్ళిపోయింది.

మరి కొన్నాళ్ళకు రాధకు సంబంధం ఖాయ మైంది. నిశ్చితార్థం రోజుకు గుంటూరు వచ్చింది. రాధ ముత్తవ తల్లి, మేనమామ కూడా వచ్చారు. ఆ సమయానికి వరలక్ష్మి ఇంకా ఇంటికి రాలేదు. కుశల ప్రశ్న లయ్యాక సీతమ్మ రాధతో ...

''పాపం కొండయ్యని ఇయ్యాల్టికి పది రోజుల నాడు ఉరితీశా రంటమ్మా'' అంది.

రాధ నిర్ఘాంతపోయింది. ఆమెకు నడినెత్తిన పిడుగు పడినట్లయింది.

''అమ్మమ్మ ... ఏంటి నువ్వంటోంది? మా నాన్నని ఉరి తీశారా? ఎందుకు?''

''అయ్యో నీకు తెలవదా? మీ అమ్మ చెప్పలా?''

"లేదు. అసలేం జరిగింది?"

"మా పక్క వూర్లో చినబాబని షావుకారు ఉన్నాళ్ళే. ఆయన్ని జంపి డబ్బెత్తుకు పోయాడని ఉరేసారు."

"నిజమా? ఎంత ఘోరం జరిగింది?"

"నీకు తెలవనే తెలవదన్న మాట. మీ మామ మొన్నొచ్చినప్పుడు మీ మమ్మీకి అంతా జెప్పాడంటగా."

"మా అమ్మది ఇంత కరకు గుండె అనుకోలేదు, అమ్మమ్మా ... మా నాన్న నా కోసమే బలై పోయాడు."

ఈ సారి నిర్ఘాంతపోవడం సీతమ్మ వంతయింది.

"ఏంటే పిల్లా నువ్వు జెపుతాంది?"

"అవును అమ్మమ్మా. మామయ్య కూతురి పెళ్ళికి వచ్చినప్పుడు మా అమ్మ నేను పక్క వూర్లో ఆమె స్నేహితురాల్ని చూసి వస్తున్నాం...

ఆ వూరి పొలిమేరల్లోకి వచ్చేసరికి జోరుగా వర్షం మొదలైంది. కాసేపు తలదాచుకుందామని రోడ్డు పక్కన ఒంటరిగా ఉన్న ఇంట్లో కెళ్ళాం" అంటూ రాధ జరిగిందంతా చెప్పింది.

"మరింత జరిగితే మా కొక్క మాటన్న జెప్పలే దేవే."

"ఎక్కడ అమ్మమ్మ... ఆ రోజు మా అమ్మకి నాకు గొడవై మేం ఇద్దరం వెంటనే తిరిగి వచ్చేసింది దీనివల్లే. బహుశ ఆ కొట్లాటలోనే అతను మా నాన్న చేతుల్లో చచ్చిపోయి ఉంటాడు. దాన్ని వాళ్ళు మరో విధంగా మార్చి నేరం మా నాన్న మీద మోపి ఉంటారు."

"ఆడు దొంగతనం చేశాడంటే ఎవళ్ళం నమ్మలా. అళ్ళిద్దరికీ యవ్వారా లున్నయ్యిలే. దాంటో మాటా మాట వచ్చి ఏమన్నా జేశాడేమో ననుకున్నాం. మరి ఎట్టా జరిగిందో గానీ పోలీసోళ్ళొచ్చేసరికి ఆడు బాగా తాగి గుడిసిలో పడున్నాడంట. డబ్బు కూడా దొరికిందంట."

"నే నసహ్యించుకున్నానని బాధపడి మా నాన్న తాగుంటాడు. దాన్ని ఆసరాగా తీసుకుని వాళ్ళే ఆ డబ్బు లోపల పెట్టించి ఉంటారు. అమ్మమ్మ మీరు నాకు కనీసం ఉత్తరమన్నా రాయించలేదు."

"ఉత్తరాలు రాసే అలవాట్లు మా కెక్కడియ్యమ్మా ... మన కుటుంబాల్లో నాలు గచ్చరాలు నేర్చింది మీ అమ్మేగా. అయినా ఇట్టా జరిగిందని మాకేం తెల్సు? తెలిస్తే వూరుకునే వాళ్ళమా?"

"నాకు తెలుసుంటే ఈ అన్యాయం జరిగుండేది కాదు అమ్మమ్మా. ఆయన్ని చూడాలని నాకు ఎన్నో సార్లు అనిపించింది. కానీ మా అమ్మ నిప్పులు గక్కుతుందని మనసులోనే అణిచిపెట్టుకున్నాను."

"పిచ్చి సన్నాసి! ఆడైనా చెప్పలే దెందుకనో. చిన బాబుని సంపింది తనేనని పోలీసోళ్ళ దగ్గిర ఒప్పేసుకున్నాడంట. నాకు ఉరేసిచ్చండి. నాకు తొందరగా సచ్చిపోవాల నుంది అని ఒకటే ఏడుపంట."

"అమ్మమ్మా ... మా నాన్న తీరు చూస్తే చాలా మంచివాడని పించాడు. కాని మా అమ్మని ఎందుకు చెరిపేశాడు?"

"స్వతాగా ఆడు చానా మంచాడే. మంచి డ్రైవరు. లారీ, లాంచీ ఏదైనా తోలేవాడు. కాకుంటే మొరటోడు. మీ అమ్మ మీద ముచ్చట పడ్డాడు. మనింటి కొచ్చి దాన్ని చేసుకుంటానని అడిగాడు ...

నీకు సదువు లేదు. అది సదువుకుంది. ఎట్టా కుదురుద్దరా అని మేం నెమ్మదిగా నచ్చజెప్పుతున్నాం. అంతలోనే మీ అమ్మొచ్చింది ... అంతా విని ...

నీ తాహతేమిటి? నా తాహతేమిటి? కళ్ళు మూసుకు పోయినయ్యా. పిచ్చి పిచ్చి కూతలు కూస్తే చెప్పుతో కొడతా జాగర్త--అంటూ ఆడిమీద ఇరుసుకు పడింది.

ఆడు తలుసుకుంటే ఆ క్షణంలోనే ఏమైనా జేసుండేవాడు. చెట్టంత మనిషయ్యె. ఎవళ్ళం మాత్రం ఆపగలిగే వాళ్ళం? కానీ ఆడు చిన్నబుచ్చుకుని, మారు మాట్లాడకుండా తిరిగెళ్ళాడు. ఎళ్ళి పీకల దాకా తాగేశాడు.

మీ అమ్మ మొదటినుంచి అంతే నమ్మ! తామసం ఒద్దే అని ఎంత చెప్పినా ఇనేది కాదు. ఎవర్నిబడితే అళ్ళని ఎంత మాట బడితే అంత మాట అనేది. కొండయ్యనే కాదు. ఇంకా ముగ్గురు నలుగుర్ని అట్టాగే పరాభవించింది. నాలు గచ్చరాలు నేర్చేసరికి ఎవడో మారాజు బిడ్డ తన కోసం వస్తా డన్నట్టుండేది దాని వాలకం.

కొండయ్య తాగినాక నలుగురు జేరి ఆణ్ణి రెచ్చ గొట్టారు. ఆడది చెప్పుతో కొడతా నంటే నోరు మూసుకున్న పిరికి యదవ అని ఎద్దేవ జేశారు. ఆ తాగిన మైకంలో ఆడు రెచ్చి పోయిమీ అమ్మని చెరిపేశాడు."

"అట్టాగా. మా అమ్మ ఇదంతా చెప్పలా నాకు."

"తెల్లారినాక ఆడు నా కాళ్ళ మీద బడ్డాడు. అత్తా నే మైకంలో తప్పు జేశానే. అదొప్పుకుంటే ఇప్పటికైనా దాని మెళ్ళో తాళి గడతానే అన్నాడు.

మీ అమ్మ ఆణ్ణి బట్టుకుని పంది. గింది. అని తిట్టి పోసిపొమ్మంది. ఆ తరవాత లోకం ఏమనుకున్నా లెక్క చెయ్యకుండా ధైర్యంగా బతికిందనుకో. నీతిగా కూడా నిలబడింది. తనకు తాను నర్సమ్మ ఉద్యోగం తెచ్చుకుంది. అయ్యన్నీ బాగానే ఉండయ్యి. కానీ ఆ తొందరపాటు మాత్రం తగ్గించుకోదే. ఇవ్వాల్టికీ అంతేనయ్యా."

"మా నాన్నకు ఉరిశిక్ష పడిన సంగతి తెలిసిన మా అమ్మ ఎంత క్రూరంగా దాచి పెట్టింది? మా నాన్న చచ్చి పోయాడంటే ఆ నేరం నాదే, అమ్మమ్మ! మా అమ్మ మాటను పట్టించుకోకుండా నే వెళ్ళి ఆయన్ని కలుసుకుంటే బాగుండేది.

ఈమె అప్పటికే తన ముల్లె కరిగి పోయిందను కుంటూాదని, ఎందుకులే గొడవలు అనుకుని వచ్చేశా. మనసు ఎంతగానో పట్టి లాగినా అణ చేసుకున్న ఇంత అనర్థానికి కారణం నేనే. నాకు నిష్కృతి లేదు." రాధ కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఏంటో పాపం ఆడి బతుకట్లా ఎళ్ళ మారి పోయింది." సీతమ్మ నిట్టూర్చింది.

• • • •


రాధ పెళ్ళి నిశ్చయమైంది. మరోవారం గడిచింది. ఒక మధ్యాహ్నం పోస్ట్‌మెన్ పార్శిల్ తెచ్చాడు. అది సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నుంచి వచ్చింది. రాధ ఆశ్చర్యంగా అందుకుని తెరిచింది.

అమ్మా రాధా.

నాకు ఉరేసిన సంగతి తెలిసే ఉంటుంది. నువ్వు సాచ్చీకం ఇస్తే బతికే వాణ్ణేమో. కానీ ఆ రోజు నా మీద నీ అసయ్యం సూశాక నిన్న అడిగినా లాభం ఉండదనుకున్నా.

కన్న కూతురు చేత అంత మాట అనిపించుకున్నాక ఇంక బతకటం దేనికని పించింది. అందుకే సచ్చి పోవాలనుకున్నా. అనవసరంగా నిన్ను అల్లరి పెట్టినాన్నికూడా అవుతానేమోనని నీ పేరు బయట పెట్టలా.

నే మొరటోణ్ణే కావచ్చు. కానీ నాకూ గుండె ఉంది. కూతురికి దగ్గిరగావాలన్న తెమతా ఉంది కానీ నా కా అదురుష్టం లేదు. సచ్చిపోతున్నా నన్న బాధ నా కేం లేదు. నన్ను అసయ్యించుకుంటే అసయ్యిచ్చుకున్నావు కానీ నా ఆఖరి కోరిక మాత్రం కాదనబాకమ్మా. తండ్రిగా నీకు నే నివ్వగలిగింది అంతకు మించి లేదు.




నీ నాన్న.

కొండయ్య."

రాధ కళ్ళు నిండి పోయాయి. పెదాలు బిగ పట్టుకుని ఆ ఉత్తరం కింద ఉన్న మరో ఉత్తరం చదవటం మొదలెట్టింది.

కుమారి రాధకు,

మీ తండ్రి కొండయ్యను ఉరితీసిన విషయం తెలిసే ఉంటుంది. తన శవాన్ని మెడికల్ కాలేజీకి అమ్మి, ఆ వచ్చిన డబ్బుతో ఒక చీర, రవిక కొని పంపమని మీ నాన్న ఉరి కంబ మెక్కే ముందు తన ఆఖరు కోర్కెగా చెప్పాడు. ఆ ప్రకారమే వీటిని పంపిస్తున్నాం. స్వీకరించండి.

సూపరిండెంటు.

విశాఖపట్నం సెంట్రల్ జైలు."

"నాన్నా." రాధ ఆ చీరను, రవిక బట్టను గుండెకు హత్తుకుంటూ పిచ్చిగా కేక పెట్టింది ✱